క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్‌నగర్, తిరుమల బార్ కూడలి, రెడ్డి కాలనీ, సుమంగళి ఫంక్షన్ హాల్, అశోక కాలనీ, బీరకుంట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ప్రకాశ్‌రెడ్డి పేట, పోస్టల్ కాలనీ, పోలీసు కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు విద్యుత్ లోకల్ కోర్టు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎస్.వి.వేణుగోపాలచారి తెలిపారు. వరంగల్ నగర శివారు ఆరెపల్లి సబ్‌స్టేషన్‌లో ఈ నెల 18న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లోకల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వినతి పత్రం రూపంలో అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

హసన్‌పర్తి ఎంపీడీఓగా సుమవాణి



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పరిషత్ అధికారిగా సుమవాణి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాడ్వాయి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సుమవాణి బదిలీపై హసన్‌పర్తి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవిని జిల్లా పంచాయతీ కార్యాలయానికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కేర్ టేకర్‌గా శ్రీనివాస్



కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల కేర్ టేకర్‌గా డాక్టర్ శాగంటి శ్రీనివాస్‌ను నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.బిక్షాలు, సూపరింటెండెంట్ బి.వీరు నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ గతంలో దూరవిద్య కేంద్రం కేర్ టేకర్‌గా రెండు పర్యాయాలు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా పనిచేశారు. దూరవిద్య కేంద్రం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మూడుసార్లు గెలుపొందారు. శ్రీనివాస్ నియామకంపై ఇంజనీరింగ్ కళాశాల బోధనేతర సిబ్బంది సంజయ్, యాదగిరి, రాజేష్, తిరుమల్ సింగ్, సాయి, ఫిరోజ్, సుమన్, తాజ్, మధు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దడవాయి యూనియన్ ఎన్నిక



వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ దడవాయి యూనియన్ నూతన అధ్యక్షుడిగా మార్త శ్యాంసుందర్ ఎన్నికైనట్లు ఎన్నికల కన్వీనర్ నిమ్మాని నాంపెల్లి ప్రకటించారు. మార్కెట్‌లోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు ఈటల దేవందర్‌పై 13ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా పార్శి కృష్ణ.. అశోక్‌పై 14ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా అప్పని కృష్ణ.. బోనాల వీరన్నపై 8ఓట్లు, సహాయ కార్యదర్శిగా ఆకుతోట సంతోష్.. తూర్పాటి రాంకిషన్‌పై 3ఓట్లు, కోశాధికారిగా సోల రవి.. రంగు రవీందర్‌పై 32ఓట్ల తేడాతో గెలుపొందినట్లు నాంపెల్లి వెల్లడించారు.

వాల్మీకి మహర్షి రథోత్సవం



హన్మకొండ: మడికొండ గ్రామంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వాల్మీకి నవరాత్రోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం ప్రారంభించారు. రథోత్సవానికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని తిరిగి వాల్మీకి భవనానికి తరలించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి, బోగి లింగయ్య, కంచనపల్లి వెంకటయ్య, నిగ్గుల వెంకట ప్రసాద్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కుర్ల మోహన్, పెనుకుల రవీందర్, శ్రీనివాస్, సాంబయ్య, నిగ్గుల రవి, మినుగు సతీష్, సాంబయ్య, పెనుకుల రవి, బోగి రాజు, దేవరాజ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

విభేదాలతో విడివిడిగా..!

- వేర్వేరుగా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక సమావేశాలు
- కాంగ్రెస్ ముఖ్య నాయకుల మధ్య కొరవడిన ఐక్యత
- ఎవరికి వారే కొండా మురళి, బస్వరాజు సారయ్య, స్వర్ణ
- వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితి



సమావేశంలో మాట్లాడుతున్న నవజ్యోతి పట్నాయక్, పక్కన నాయకులు

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా వరంగల్‌లో గురువారం నిర్వహించిన సమావేశానికి వరంగల్, హనుమకొండ జిల్లాల ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాత్రమే హాజరయ్యారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరుకాలేదు. వారు హనుమకొండలోని డీసీసీ భవన్‌లో మరో సమావేశం ఏర్పాటుచేసి కార్యకర్తల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. దీంతో ముఖ్య నాయకుల మధ్య అనైక్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వరంగల్ తూర్పులో కొండా వర్గం, కొండా వ్యతిరేక వర్గం ఉన్నట్లు జనాల్లోకి బలమైన సంకేతాలు వెళ్తున్నాయని కార్యకర్తలు అంటున్నారు. మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో ఉండడంతో సమావేశానికి హాజరు కాలేదు. ఉదయం వరంగల్, సాయంత్రం హనుమకొండలోని వరంగల్ డీసీసీ భవన్‌లో మరో సమావేశంలో నవజ్యోతి పట్నాయక్ పాల్గొని అభిప్రాయాలు సేకరించారు. మరోసారి ఎర్రబెల్లి స్వర్ణకే డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఓ వర్గం నేతలు ఆయనకు ప్రతిపాదనలు ఇచ్చారు.

కార్యకర్తలు మెచ్చిన వారికే డీసీసీ పదవి

ఏఐసీసీ వరంగల్, హనుమకొండ జిల్లాల పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపికలు ఏఐసీసీల పర్యవేక్షణలోనే జరుగుతాయని ఏఐసీసీ వరంగల్, హనుమకొండ జిల్లాల పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ అన్నారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు సూచించిన వ్యక్తులకే డీసీసీ అధ్యక్ష పదవి అప్పగించాలన్న నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వరంగల్ తూర్పులోని 24 డివిజన్ల నాయకులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమై వారి సూచనలు తీసుకుంటామని అన్నారు. 'ఇక్కడ జరిగే ప్రతి విషయం టీపీసీసీ, ఏఐసీసీ దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ నేరుగా తనతో చెప్పొచ్చు' అని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ . కొండా సురేఖ, మురళి చెప్పిన వారికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వరని, కార్యకర్తలు చెప్పిన వారికే అవకాశం దక్కుతుందన్నారు. అనంతరం నవజ్యోతి పట్నాయక్, టీపీసీసీ పరిశీలకులు కోఆర్డినేటర్లు డివిజన్ల వారీగా నాయకులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. టీపీసీసీ నాయకులు మీసాల ప్రకాశ్, గోపాల నవీన్‌రాజుతో ఒకటి, రెండు డివిజన్లలో అయూబ్‌ఖాన్, భాషిపాక సదానందం పేర్లు వచ్చినట్లు తెలిసింది. పీసీసీ పరిశీలకులు, కోఆర్డినేటర్లు భాస్కర్, రేణుక, ఆదర్శ్‌తో పాటు కార్పొరేటర్లు సురేష్‌జోషి, బస్వరాజు కుమారస్వామి, ఓని భాస్కర్, డివిజన్ నాయకులు రాజేశ్ కూచన రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, యెలుగం సత్యనారాయణ, జారతి వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ భవన్‌లో అభిప్రాయాల సేకరణ

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం గురువారం హనుమకొండ డీసీసీ భవన్‌లో జరిగింది. ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకే మరోసారి అవకాశం కల్పించాలని ముక్తకంఠంతో కోరినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, బస్వరాజు శ్రీమాన్, నాయకులు తత్తరి లక్షణ్, బిల్లా శ్రీకాంత్, దామెర సర్వేశం, జన్ను రవి, కరాటే ప్రభాకర్, కురిమి పరమేశ్వర్, గోరంట్ల రాజు, చాగంటి శ్రీనివాస్, ఎండీ అయూబ్, కోదాటి అనిల్, తాహేర్, బషీర్, అరెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్.. పేదల ప్రభుత్వం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 2, 43, 56వ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే పథకాలు వర్తింపజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అరుణవిక్టర్, మాజీ జెడ్పీటీసీ బానోతు సింగులాల్, కాంగ్రెస్ హనుమకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, డివిజన్ అధ్యక్షులు కొంక హరిబాబు, గడ్డం శివరాం, పొన్నాల రఘు, మణీందర్ నాథ్, చింత ప్రకాష్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ చింత రమేష్, దూలం సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

ఖిలా వరంగల్: మహిళలు, బాలికల రక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శోభారాణి సూచించారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో సఖి సెంటర్ మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో స్వప్న అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో శోభారాణి మాట్లాడారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని చెప్పారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆపదలో బాధిత మహిళలు 181, 100, 1098, 14567 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సుహాసిని, జయమ్మ, ఏఎన్‌ఎం, ఆశ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విజయవాడలో సౌకర్యాలు కల్పించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సిబ్బంది

కాజీపేట రూరల్: విజయవాడ రైల్వే స్టేషన్‌లోని టీటీఈ రెస్ట్ హౌస్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, కాజీపేట, వరంగల్ రైల్వే మజ్దూర్ యూనియన్ టికెట్ చెకింగ్ జనరల్ బ్రాంచ్ చైర్మన్ డి.శ్రీనివాస్‌యాదవ్ గురువారం డిమాండ్ చేశారు. వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్ స్టేషన్ల నుంచి రైళ్లలో టికెట్ చెకింగ్ విధులపై వెళ్లిన రైల్వే టీటీఈలకు విజయవాడ రెస్ట్ హౌస్‌లో కొన్ని గంటల పాటు విశ్రాంతి తీసుకొని తిరిగి విజయవాడ నుంచి కాజీపేట, వరంగల్, సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో విధులు నిర్వర్తిస్తారు. ఈ నెల 16, 17, 18వ తేదీల్లో బ్లాక్ బ్యాడ్జీస్ క్యాంపెయినింగ్ కార్యక్రమంలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి టికెట్ చెకింగ్ స్టాఫ్ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

మట్టి ప్రమిదల ప్రదర్శన, విక్రయం



మట్టి ప్రమిదలతో విద్యార్థులు, అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగళి మహిళా కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో బన్ను మనోవికాస పునరావాస కేంద్రం విద్యార్థులు వివిధ రకాల డిజైన్లతో చేసిన మట్టి ప్రమిదల ప్రదర్శన, విక్రయశాలను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుహాసిని మాట్లాడుతూ మట్టి ప్రమిదలను వాడి కాలుష్యం నుంచి పర్యావరణను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అధ్యాపకులు అరుణ, బన్ను మనోవికాస పునరావాస కేంద్రం స్పెషల్ ఎడ్యుకేటర్ రాము, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కవిత, రామరత్నమాల, మమత, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వాంకుడోతు వీరన్న

హన్మకొండ: డక్ అండ్ డ్రైన్ నిర్మించిన 100 ఫీట్ల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కార్యదర్శి వాంకుడోతు వీరన్న డిమాండ్ చేశారు. హనుమకొండ సమ్మయ్యనగర్‌లో మండల కమిటీ సీపీఎం కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్‌పూర్ చెరువు నుంచి ఇంజనీర్స్ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ లైటింగ్ కోసం సమ్మయ్యనగర్ వాసులు నిరాహార దీక్ష, రాస్తారోకో చేయగా, పాలకులు వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు పరిష్కరించలేదని అన్నారు. వి.రాజు, టి.వెంకన్న, రాధిక, రమేష్ చారి, లాలు, సాంబయ్య, మంజుల, మానస, స్వప్న, సమ్మయ్య, వీరాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

హన్మకొండ: ఆక్రమణలపై వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఆక్రమణలతో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుండడంతో తగు చర్యలకు బల్దియా పూనుకుంది. ఈ క్రమంలో ఇటీవల వడ్డేపల్లి శ్మశాన వాటిక దగ్గర కమ్యూనిటీ హాల్ అధికారులు కూల్చారు. కాగా, కమ్యూనిటీ హాల్ కూల్చివేతపై వడ్డేపల్లి దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమకొండ గోకుల్ కూడలి – అంబేడ్కర్ భవన్ రోడ్డులో రెండు జేసీబీలతో ఆక్రమణలను గురువారం తొలగించారు. నాలాపై వేసిన పైకప్పుతో పాటు, రోడ్డుపై నిర్మించిన ఆక్రమణలను తొలగించారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

హన్మకొండ: వ్యవసాయ యాంత్రీకరణకు రాయితీపై పనిముట్లు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు, పనిముట్లు అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలు అవసరమైన రైతులు తమ మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలన్నారు. మండలాల వారీగా పరికరాలు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు బ్యాటరీ, ఫుట్ మాన్యువల్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 1886, పవర్ స్ప్రేయర్లు 387, రోటోవేటర్లు 96, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 18, డిస్క్ హారో, కల్టివేటర్, ఎంబీ ప్లవ్, కేజీవీల్స్ రోటో పడ్లర్ 131, బండ్ ఫార్మర్ 9, పవర్ వీడర్ 17, బ్రష్ కట్టర్ 25, పవర్ టిల్లర్లు 17, స్ట్రా బేలర్లు 19 మంజూరైనట్లు వివరించారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి



వరంగల్: మాట్లాడుతున్న బయ్య స్వామి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కేయూ క్యాంపస్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈనెల 18న జరగబోయే రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఆవరణలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బంద్ వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బుట్ట శ్యాంయాదవ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఆలకుంట్ల ఎల్లయ్య, బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోల్తి సారన్న, విద్యార్థి విభాగం అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, జిల్లా జనరల్ సెక్రటరీ శివానంద్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి పవన్, తదితరులు పాల్గొన్నారు.

నయీంనగర్: బీసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ఫర్ జస్టిస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేసిన సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు, బీసీ సంఘం నాయకులు సతీష్, శ్యామ్‌యాదవ్, అంజన్‌రావు, రాజమౌళి, రమేష్, కొమురయ్య పాల్గొన్నారు.

వరంగల్: బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని వరంగల్ ముదిరాజ్ సంఘం అర్బన్ అధ్యక్షుడు బయ్య స్వామి పిలుపునిచ్చారు. కాశిబుగ్గలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో కమిటీ అధ్యక్షుడు బిల్ల శివశంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో స్వామి మాట్లాడారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేశబోయిన దేవేందర్, కూరాకుల చంద్రశేఖర్, తిరుపతి, వన్నాల రాజు, ప్రకాష్, రాజు, సమ్మయ్య, రాజు, దేవరాజ్, రాహుల్, పవన్, చింటూ, నరేష్, రాజు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఈనెల 18న జరగబోయే తెలంగాణ రాష్ట్ర బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని టీఎస్ ఆర్టీసీ మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ క్రమంలో బీసీలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

హన్మకొండ: బీసీ బంద్‌కు దళిత బహుజన ఫ్రంట్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన డిమాండ్ అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఖిలా వరంగల్: 18న నిర్వహించనున్న రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని బీసీ నాయకుడు మేరుగు అశోక్ పిలుపునిచ్చారు. వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో పద్మశాలి 35వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం రవి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి నాయకులు వెంగల్‌దాస్ రాజేంద్రప్రసాద్, అంకతి అఖిల్, చిదురాల సాయిరాం, రాజేంద్రప్రసాద్, గడ్డం సాయి, దీక్షిత్, రాంచందర్, పోల రోషన్ తదితరులు పాల్గొన్నారు.

మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

హన్మకొండ: అప్రజాస్వామికంగా విధుల్లో నుంచి తొలగించిన అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మహాదేవయ్యను విధుల్లో నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ హనుమకొండలోని తపాలా హనుమకొండ డివిజన్ కార్యాలయం ఎదుట తపాలా ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల కోసం వేసిన కమలేశ్‌చంద్ర అనుకూల సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ జేసీఏ ఆధ్వర్యంలో చేసిన నాలుగు రోజుల నిరవధిక సమ్మెకు బాధ్యుడిని చేస్తూ కక్షపూరితంగా జాతీయ నాయకున్ని అక్రమంగా సర్వీసు నుంచి తప్పించడం చట్టవిరుద్ధమని అన్నారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ క్లాస్ –3 సెక్రటరీ టి.సారయ్య, పోస్ట్‌మెన్, ఎంటీఎస్ సెక్రటరీ కె.అశోక్, ప్రెసిడెంట్ బి.అరవింద్, తపాలా ఉద్యోగులు పెరుమాండ్ల తిరుపతి, శంకర్, అజయ్ పాల్, పరంజ్యోతి, శ్రీలత, జె.బాపూజీ, ఎస్.ఎల్లయ్య, పి.అశోక్, ఆనందం, ఎం.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సర్లకు అభినందన



బాక్సర్లు, కోచ్‌తో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్



క్రీడాకారులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ స్పోర్ట్స్: ఇటీవల హనుమకొండలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ –17 బాలబాలికల రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన డీఎస్‌ఏ ఖేలో ఇండియా సెంటర్ క్రీడాకారులను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ గురువారం అభినందించారు. ఎండీ.అఫ్రిన్ బంగారు పతకం సాధించగా, లలిత్ కౌశిక్ (వెండి), కె.సాయి ప్రణీత, భార్గవ్, శశాంక్, గిన్నారపు ఆర్యన్ కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ దేవరకొండ ప్రభుదాస్‌ను సన్మానించారు.

క్రీడాకారులకు సన్మానం

కేయూ క్యాంపస్: ఇటీవల బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విశ్రాంత ఉద్యోగులకు నివాళి



విద్యారణ్యపురి: ఉద్యోగ విరమణ పొంది బకాయిలు అందక మానసిక క్షోభ, అనారోగ్యంతో మరణించిన విశ్రాంత ఉద్యోగులకు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం రాత్రి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ల ధర్మేంద్ర, ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, అసోసియేషన్ కార్యదర్శులు దామోదర్, శ్రీనివాస్, ఆర్‌వీ.చలం, అశోక్‌కుమార్, విశ్వనాథం, రఘువీర్, శ్యామ్‌రావు, కృష్ణమూర్తి, శ్యామ్‌సుందర్, సజీవరెడ్డి, గణపతి, ఫర్వీన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసం ముగింపు వేడుకలు

ఖిలా వరంగల్: తమ పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లను తల్లులు నేర్పాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. పోషణ మాసం ముగింపు వేడుకల సందర్భంగా వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, సరిత, స్వరూప, విజయలక్ష్మి, శ్రీలత, కళ్యాణి, సునీత, సుకన్య, జ్యోతి, కమల, ఆయాలు సునీత, కవిత, మాధవి, శారద, పద్మ, రజిని పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఎంజీఎం: సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ చిలక మురళి ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పారా మెడికల్ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య హాజరుకాగా, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాటు చేయండి

ఖిలా వరంగల్: దీపావళి పర్వదినం సందర్భంగా ఉత్సవాలకు భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు హనుమకొండలో క్రైం, ట్రాఫిక్ డీసీపీ రాయల ప్రభాకర్‌ను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్లి రవి, సభ్యులు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు.

నా ఆలోచనలు పుస్తకం ఆవిష్కరణ

హన్మకొండ: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంపై కాకతీయ యూనివర్సిటీ బీఆర్‌ఎస్‌వీ నాయకుడు పిన్నింటి విజయ్‌కుమార్ రాసిన అనేక వ్యాసాలను 'నా ఆలోచనలు' అనే పేరుతో పుస్తకం తీసుకురావడం మంచి పరిణామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నా ఆలోచనలు పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత పిన్నింటి విజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి చెరువు శిఖంపై ఆగ్రహం

హసన్‌పర్తి: దేవన్నపేటలోని తూర్పు చెరువు కబ్జాపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కబ్జాదారుల వివరాలపై ఆరా తీస్తున్నారు. 'అమ్మకానికి శిఖం భూమి' అనే కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఎంతటివారైన ఉపేక్షించొద్దని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నీటి పారుదలశాఖ అధికారులు గురువారం సంఘటన స్థలాన్ని సందర్శించి చదును చేసిన భూమి, తొలగించిన మత్తడిని పరిశీలించారు. అనంతరం, నీటి పారుదల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు నిందితులు దేవన్నపేటకు చెందిన పోలెపాక అశోక్, చిరంజీవిపై కేసు నమోదు చేసినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

హోం టు బ్యాంక్ లైఫ్ సర్టిఫికెట్

కాజీపేట అర్బన్: పింఛన్‌కు బ్యాంకుల వరకు వెళ్లలేని స్థితిలో ఉన్న రైల్వే రిటైర్డ్ పెన్షనర్లకు హోం టు బ్యాంక్ లైఫ్ సర్టిఫికెట్ పేరిట కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి మారపాక కట్టస్వామి సేవలందిస్తున్నారు. కడిపికొండ, రాంపేటలోని వృద్ధ పెన్షనర్ల ఇంటి వద్దకే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో అందజేస్తున్నారు. ప్రతీ ఏడాది నవంబర్ మాసం కంటే ముందు బ్యాంకుల్లో పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉందన్నారు.

ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి పరామర్శ

హన్మకొండ: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్ పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే దొంతి మాతృమూర్తి కాంతమ్మ మృతి చెందగా, హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలోని స్వగృహంలో మాధవ రెడ్డి కుటుంబ సభ్యులను సుందర్‌రాజు యాదవ్, తదితరులు గురువారం పరామర్శించారు.

వ్యవసాయ ట్రాక్టర్ సీజ్

ఖిలా వరంగల్: నకిలీ వాహన బీమా పత్రాలపై రవాణాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల హనుమకొండ, వరంగల్ రవాణా శాఖల్లో నకిలీ వాహన బీమా పత్రాలు వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. గురువారం వరంగల్ రవాణాశాఖలో నకిలీ బీమా పత్రం ఉదంతం వెలుగు చూసింది. ఓ వాహన యజమాని రిజిస్ట్రేషన్ కోసం వ్యవసాయ ట్రాక్టర్‌ను తీసుకొచ్చారు. సదరు యజమాని సమర్పించిన ధ్రువీకరణ పత్రాల్లో వాహన బీమా పత్రాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించగా అది నకిలీదని తేలింది. వెంటనే ఆర్టీఏ అధికారులు అప్రమత్తమై ట్రాక్టర్ రిజిస్ట్రేషన్‌ను నిలిపివేశారు.

రిటైర్డ్ జవాన్‌పై ఫిర్యాదు

వరంగల్ అర్బన్: ప్లాస్టిక్ నిరోధక సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడంతో బల్దియా రిటైర్డ్ జవాన్‌పై హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు నమోదైంది.